క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన సీఐ



ఎమ్మెల్యే సుధాకర్‌కు పూల బొకే అందజేస్తున్న సీఐ

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు సీఐగా ఎస్ మన్సురుద్దీన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌ను ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలని సీఐకు ఎమ్మెల్యే సూచించారు.

నాడు నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి



అభివృద్ధి పనులను తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీర్ సిబ్బందితో పనులపై చర్చించారు. గదుల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీనివాసులు, ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ దేవస్థానం చైర్‌పర్సన్‌గా ఉమామహేశ్వరమ్మ



కోడుమూరు ఎమ్మెల్యే సతీమణి విజయలలితను కలిసిన ఉమామహేశ్వరమ్మ

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవస్థానం చైర్మన్‌గా ఉమామహేశ్వరమ్మను మంగళవారం ప్రభుత్వం నియమించింది. ఆలయ చైర్మన్‌తో పాటు ఎనిమిది మందిని సభ్యులను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ సతీమణి విజయలలితను ఉమామహేశ్వరమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 2న చేయనున్న ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని ఆమెను కోరారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటాన్ని అందిస్తున్న దాత వీరేంద్ర

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో కొలువైన గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవికి హైదరాబాద్‌కు చెందిన వీరేంద్ర, వేద దంపతులు మంగళవారం వెండి కిరీటాన్ని బహుకరించారు. అమ్మవారి మొక్కులో భాగంగా దాతలు కిలో 19 గ్రాముల వెండితో ప్రత్యేకంగా చేయించిన కిరీటాన్ని అర్చకులకు అందజేశారు. అమ్మవారి పూజల అనంతరం ఆలయ పూజారి నాగ సుంకన్న, కేశవ్ దాతలకు తీర్థ, ప్రసాదాలను అందించారు.

వరుణుడు కరుణించాలని అమ్మవారి విగ్రహం ఊరేగింపు



కె.నాగలాపురంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: వరుణుడు కరుణించాలని కోరుతూ మంగళవారం భక్తులు కె.నాగలాపురం నుంచి పెంచికలపాడు వరకు శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతూ రైతులు అవస్థలు పడుతున్నారని, అమ్మవారు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ పెంచికలపాడుకు చెందిన భక్తులు అమ్మవారి విగ్రహం ఊరేగింపు చేపట్టారు. అనంతరం పెంచికలపాడు నుంచి కె.నాగలాపురం వరకు మరలా అమ్మవారి విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల నుంచి వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని కాటసాని సూచించారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని కోరగా ఆయా సమస్యలను సకాలంలో పరిష్కారించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడా గమనించి వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ రెడ్డి, శ్వేతారెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, మహేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ బాబు, బాలచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ



మారెమ్మ, లింగమయ్య గుడికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో మారెమ్మ, లింగమయ్య ఆలయాల నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే ఎమ్మెల్యే దంపతుల ఆర్థిక సమకారంతో స్థల దాత బిజ్జమ్మ కుమార్తె లక్ష్మీదేవి స్థలంలో నిర్మించిన పీర్ల చావిడిని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటక్రిష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సత్యాలు, రమణ, మైనర్ ఇరిగేషన్ డీఈ అశ్వర్థనారాయణ, కో– ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, మండల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి, కందికాయపల్లె సర్పంచ్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యం



మహిళకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమ పథకాలతోనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కిందపడటంతో కుడి చేయి విరిగి ఏ పనీ చేసుకోలేని స్థితిలో ఉన్నాని, పింఛన్ మంజూరు చేయించాలని ఎమ్మెల్యేకు ప్లంబర్ అక్బర్ విన్నవించారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని, 2013లో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ పెరుగు హరినాథ్‌రెడ్డి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఎంపీడీఓ అజాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి

కల్లూరు: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి బూత్ లెవల్ అధికారులకు సూచించారు. మంగళవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తొలగింపు ప్రక్రియ గురించి ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌బాబుతో కలిసి కల్లూరు అర్బన్ పరిధిలోని ముజఫర్‌నగర్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామానికి చెందిన గర్భిణి సుజాత మంగళవారం 108లోనే ప్రసవించింది. ఉదయం సుజాత పురిటి నొప్పులతో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గర్భిణిని వాహనంలో ఎక్కించారు. నొప్పులు అధికమై వాహనంలోనే ప్రసవించింది. అనంతరం అదే వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ఈఎంటీ ప్రవీణ తెలిపారు.

నేడు సచివాలయం ప్రారంభోత్సవం

సి.బెళగల్: మండల పరిధిలోని ఈర్లదిన్నె బీసీ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ చేయనున్నట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ గంగరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అధికారలతో కలిసి నూతన గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలించిన ఏఈ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలిరావాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న లోటర్ బాషా

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు సూచించారు. మంగళవారం స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఒక్కో వలంటీర్‌కు కేటాయించిన 50 కుటుంబాలకు పథకాలు పారదర్శకంగా అందుతున్నాయో లేదో పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటే వేసేలా చైతన్యం చేయాలన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయడంతో మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు షాకిరున్నీషా, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, కన్వీనర్లు బి.సుధాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: పత్తి సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని ర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. సి.బెళగల్ సమీపాన సాగు చేసిన పత్తి పైరును వ్యవసాయ అధికాలు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం సి.బెళగల్‌లోని వ్యవసాయ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బొంతల మునెప్ప, సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన రైతులకు పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు కల్యాణి, శివరామకృష్ణ, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు పత్తి పంట సస్యరక్షణ చర్యలు, మెలుకువలను ఎరువుల వినియోగం, పంటల రక్షణ తీరును రైతులకు విపులంగా వివరించారు. పత్తిపంట సాగులో ఏర్పడిన పరిస్థితులను వివరిస్తూ పత్తి ఉత్పాదకత గణనీయంగా తగ్గిందన్నారు. తక్కువ కాలపరిమితో పంట సాగును చేసి అధిక లాభాలు పొందే విధానాలను వివరించారు. అధిక సాంద్రత సాగులో ఎకరానికి లక్ష ఇవరై వేల వరకు మొక్కలను విత్తుకోవాలన్నారు. పంట మార్పిడితో రెండవ పంటలను సాగు చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం ఏడీఏ సేంద్రియ ఎరువుల తయారీ, పంట రక్షణ పద్ధతులను తెలిపారు. అదేవిధంగా పంటనష్ట బీమా నమోదు, పంటసాగు నమోదు అంశాలను తెలిపారు. ఎంపీపీ, సర్పంచ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా వ్యవసాయ రంగ పథకాలు, అధికారుల సేవలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ శశిధర్ రెడ్డి, ఏఈఓ సిద్దు, ఎంపీఈఓలు, వీఏఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కల్లూరు: వర్షాలు లేక పంటలన్నీ ఎండిపోతున్నాయని, కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దటేకూరు సమీపంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీనివాసరావు, పుల్లన్న, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

గడివేముల: స్పందన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ సమస్యలపై ఆరా తీసి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.

వర్షం కోసం పూజలు

గడివేముల: వరుణ దేవుడు కరుణించాలని గడివేముల, గని గ్రామాల ప్రజలు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడివేములలోని దూదేకులు, కురువలు కందూనది సమీపంలోని గంగమ్మ వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గని గ్రామంలో బెస్త కులస్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెడ్పీ స్కూల్ విద్యార్థులకు, ప్రజలకు అన్నదాన ప్రసాదాలు అందించారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు: నగర శివారులోని లేబర్ కాలనీలో నివాసముంటున్న గణేష్ (25) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్ గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా మత్తుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతూ ఆర్థికంగా చితికిపోయి తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి

కోడుమూరు : జగనన్న గృహ నిర్మాణం పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులంతా త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలోని జగనన్న కాలనీని మంగళవారం హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై అధికారులు, లబ్ధిదారులతో పీడీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరికి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన బిల్లులను మంజూరు చేస్తోందన్నారు. జగనన్న కాలనీల్లో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అవసరమైన కరెంట్, రోడ్లు, మంచినీటి సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. అలాగే హౌసింగ్ సిబ్బంది కూడా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పీడీ కోడుమూరు చేరుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో మండలంలో జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాలపై ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈఈ వాసుదేవరావు, ఏఈ లక్ష్మన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్చించారు.

అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు ప్రారంభం



పాణ్యం: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర క్రీడలను మంగళవారం కళాశాల డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి 12 ఫార్మసీ కళాశాలల జట్లు పాల్గొన్నట్లు వారు తెలిపారు.



గిడుగుకు ఘన నివాళి

లక్ష్మీపురం కేజీబీవీలో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(మైనార్టీ)లో మంగళవారం గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు బాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

– గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ స్కూల్‌లో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు ఇన్‌చార్జ్ హెచ్ఎం దస్తగిరమ్మ, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

– సి.బెళగల్: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఓ జ్యోతి ఆధ్వర్యంలో గిడుగు రామూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు.



గడివేములలో..

ఓటరు జాబితా సవరణకు సవకారం అందించండి



మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ కోరారు. మంగళవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారని, రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా పాల్గొంటే పూర్తి స్థాయిలో ఓటరు జాబితా తయారు అవుతుందన్నారు. ఓటరు జాబితాలో బీఎల్ఓలు డబల్ ఎంట్రీ, మృతి చెందిన వారి పేర్లు తొలగిస్తారని ఆర్డీఓ తెలిపారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎన్నికల డీటీ ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు జే.ఆబేల్, టీడీపీ, బీజేపీ ప్రతినిధులు సుందరరాజు, గజేంద్రగోపాల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అటల్ పెన్షన్ యోజనలో జిల్లా టాప్

- జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలి
- కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(అర్బన్): అటల్ పెన్షన్ యోజన పథకానికి 53,913 మంది లబ్ధిదారులను చేర్పించడం ద్వారా రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవతేజ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జిల్లాలోని బ్యాంకు అధికారులతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవతేజ మాట్లాడుతూ అర్హత ఉన్న లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చి ప్రోత్సహించాలన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు మార్టిగేజ్ డాక్యుమెంట్ సదుపాయం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలన్నారు. కెనరా బ్యాంకు సహకారంతో సెల్‌ఫోన్ రిపేర్లు, సర్వీసు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సీసీటీవీ సర్వీసింగ్ తదితర శిక్షణా కార్యక్రమాలు పొందిన యువత తమ సర్టిఫికెట్లను బ్యాంకులకు అందించి రుణాలు పొంది స్వయం సమృద్ధి సాధించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి రూ.4,550.92 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగానికి రూ.3641.72 కోట్లు మంజూరు చేశామని, రాబోయే మూడు త్రైమాసికాలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆయన జిల్లాలోని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కెనరా బ్యాంకు ఆర్ఎం ఏపీ రావు, ఆర్‌బీఐ లీడ్ బ్యాంకు ఆఫీసర్ నాగప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌కు 'హంస' పురస్కారం ప్రదానం



అతిథుల చేతుల మీదుగా హంస పురస్కారం అందుకుంటున్న రచయిత అజీజ్

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హంస పురస్కారం-2023ను జిల్లా నవలా రచయిత ఎస్.డి.వి. అజీజ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ ప్రదానం చేసింది. తెలుగు సాహిత్యంలో విశేష సేవలు అందించిన అజీజ్‌కు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో జరిగిన మాతృభాష దినోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖా మాత్యులు కారుమూరు వెంకటనాగేశ్వరరావు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మజ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి.భరత్ సూచించారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ జి.భరత్ నేత్రదానం విశిష్టతను, ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి వైద్యున్ని సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. తినే ఆహారంలో ఆకుకూరలు, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, గుడ్లు, చేపలు, పాలు, విటమిన్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. నేత్రదానం చేసేందుకు అన్ని వయస్సుల వారు అర్హులేనని, బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నా నేత్రదానం చేయవచ్చన్నారు. కుక్కకాటు, రేబిస్ వ్యాధి, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారు మాత్రం నేత్రదానం చేయకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, వైద్యులు సృజన, సుభాన్, పరమేశ్వరరెడ్డి, బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎస్ఎంసీ చైర్మన్ మృతి



వలిబేగ్(ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) చైర్మన్ పెద్ద వలిబేగ్(52) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు, కొడుకు, కూతురు ఉన్నారు. అతని మరణం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి మంగళవారం ఉదయం వలిబేగ్ కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహం వద్ద నివాళులర్పించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: మండల పరిధిలోని కేతవరం గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మూలస్వాములు (68) కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 20న ఇంట్లో గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగడంతో ఆర్పడానికి వెళ్లిన మూల స్వాములకు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట కేశవరెడ్డి పాఠశాల వద్ద ప్రయాణికుల కోసం వేచి ఉన్న ఆటోను వెనుక నుంచి మరో ఆటో ఢీకొంది. ప్రమాదంలో ముందు ఉన్న ఆటో డ్రైవర్ ఉసేన్‌బాషాకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు.